సాక్షి
కుమురం భీం

మంగళవారం, 6, ఫిబ్రవరి, 2024



ఇంద్రాదేవికి 'మెస్రం' పూజలు

గంగాజలం సేకరించిన మెస్రం వంశీయులు పాదయాత్రగా సోమవారం ఇంద్రవెల్లికి చేరుకున్నారు. ఇంద్రాదేవి ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. 8లో▸



'వేటా'డేస్తున్నారు..!

జిల్లాలో వేటకు అడ్డుకట్ట పడటం లేదు. వేటగాళ్లు నిత్యం విద్యుత్ తీగలు, విషపు గుళికలు పెట్టి వన్యప్రాణులు, పక్షులను హతమారుస్తున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం 34.1 /20.1

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా ఎక్కువగా నమోదవుతాయి. పగలు వేడిగా ఉంటుంది. రాత్రి చలి తగ్గుముఖం పడుతుంది.

పరిశుభ్రతే లక్ష్యం

- ఈ నెల 7 నుంచి 15 వరకు గ్రామాల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్
- పారిశుధ్య పనులతోపాటు నీటి ఎద్దడి నివారణకు చర్యలు
- ప్రత్యేకాధికారులకు సవాల్‌గా గ్రామ పాలన
- జిల్లాలో 335 గ్రామ పంచాయతీలు



రెబ్బెన మండలం గంగాపూర్‌లో పారిశుధ్య పనులు

రెబ్బెన(ఆసిఫాబాద్): గ్రామాల్లో సర్పంచుల పదవీ కాలం ఇటీవలే ముగిసింది. ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా పాలన బాధ్యతలను ప్రత్యేకాధికారులకు అప్పగించింది. అలాగే గ్రామాల్లో పరిశుభ్రతే లక్ష్యంగా స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహణకు శ్రీకారం చుట్టింది. పారిశుధ్య పనులు చేపట్టడంతోపాటు వేసవిని దృష్టిలో ఉంచుకుని నీటిఎద్దడి పరిస్థితులు తలెత్తకుండా తగు చర్యలు చేపట్టనుంది. అయితే ప్రభుత్వం గ్రామ పరిపాలనపై ఏ మాత్రం అవగాహన లేని ప్రభుత్వ అధికారులను పంచాయతీల ప్రత్యేకాధికారులుగా నియమించింది. ఒక్కో ప్రత్యేకాధికారి మూడు, నాలుగు పంచాయతీల బాధ్యతలు చేపట్టారు. దీంతో గ్రామాల్లో పాలన, స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహణపై అనుమానాలు తలెత్తుతున్నాయి.

ప్రత్యేక కార్యక్రమాలు

జిల్లాలో మొత్తం 15 మండలాల పరిధిలో 335 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఐదేళ్ల సర్పంచుల పదవీ కాలం ఈ నెల 1తో ముగిసింది. ప్రభుత్వం పంచాయతీలకు 125 మంది ప్రత్యేకాధికారులను నియమించింది. వారు ఇటీవలే బాధ్యతలు స్వీకరించడంతో ప్రభుత్వం గ్రామ పరిపాలనపై దృష్టి సారించింది. ఈ నెల 7 నుంచి 15 వరకు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించనుంది. ఇందులో భాగంగా ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణ సైతం అందించింది. ప్రత్యేకాధికారులకు 2018 నూతన పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన కల్పించడంతో పాటు పంచాయతీల్లో నిర్వహించే అన్ని రకాల రికార్డుల గురించి అవగాహన కల్పించారు. ఎనిమిది రోజులపాటు గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. రోడ్లు శుభ్రం చేయడం, పిచ్చిమొక్కలు తొలగించడం, డ్రైనేజీలు శుభ్రం చేయడం, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పారిశుధ్య పనులు చేపట్టడం తదితర కార్యక్రమాలు చేపట్టనున్నారు. అలాగే ప్రమాదకరంగా మారిన పాత, మూతబడిన బావులు గుర్తించి పూడ్చివేయడం, తాగునీటి ట్యాంకులు శుభ్రం చేయడం వంటి పనులు చేపట్టేందుకు యంత్రాంగం సమాయత్తమవుతోంది.

తాగునీటి ఎద్దడి లేకుండా..

వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ఈ స్పెషల్ డ్రైవ్‌లో చర్యలు చేపట్టనున్నారు. గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని అన్ని గ్రామాలకు వర్తింపజేసింది. అయితే జిల్లా కేంద్రం ఆసిఫాబాద్‌తోపాటు అనేక గ్రామాలకు నేటికీ మిషన్ భగీరథ నీరు అందడం లేదు. ఇటీవల జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలోనూ మిషన్ భగీరథ పనితీరుపై సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో గ్రామాల్లో ఇంటింటికీ మిషన్ భగీరథ నీరందించే బాధ్యతను పంచాయతీలకు అప్పగించారు. ఇంటింటి సర్వే నిర్వహించి నల్లాలు ఉన్నాయా.. లేదా గుర్తించడంతోపాటు కనెక్షన్ లేని ఇంటికి నల్లాలు బిగించడం, పైపులైన్ల లీకేజీలకు మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకోనున్నారు. ఓపెన్ బావుల్లో క్లోరినేషన్ పనులు సైతం చేపట్టనున్నారు.

నిధుల కొరత

కొత్త ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు పంచాయతీలకు ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు. పంచాయతీలు నిధుల సమస్యతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. సర్పంచులు పదవీలో ఉండగా పంచాయతీ బాధ్యతను భుజాన వేసుకుని నెట్టుకొచ్చారు. ప్రస్తుతం ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుండడంతో పంచాయతీ అవసరాలు ఎలా తీరుతాయో అని కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు. స్థానికంగా పంచాయతీలకు వచ్చే ఆదాయ వనరులపై ఆధారపడాల్సి వస్తోంది. ప్రస్తుతం ఆర్థిక సంవత్సరం ముగింపు సమయం కావడంతో పంచాయతీ కార్యదర్శులు వనరుల కోసం ఇంటిపన్నుల వసూళ్లు, పన్నేతర వసూళ్లపై దృష్టి సారించారు.

సఫలీకృతమయ్యేనా..?

గ్రామాల అభివృద్ధి, పంచాయతీల పాలనలో ప్రత్యేకాధికారులు ఏ మేరకు సఫలీకృతం అవుతారో అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఎంపీడీవోలు, ఎంపీవోలు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఇరిగేషన్ ఏఈఈ, పంచాయతీరాజ్ ఈఈ, ఏఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, వ్యవసాయాధికారి, ఐసీడీఎస్, పశు వైద్య అధికారులు, ఉద్యానవనశాఖ అధికారులు, ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రత్యేకాధికారులుగా నియమితులయ్యారు. వీరిలో చాలా మందికి పంచాయతీలో నిర్వహించే రికార్డులపై కూడా సరైన అవగాహన లేదు. దీంతో గ్రామాల అభివృద్ధి, పారిశుధ్య కార్యక్రమాలు, ఇతర రోజువారి కార్యక్రమాల నిర్వహణ పెద్ద సవాల్‌గా మారనుంది. మాతృశాఖతోపాటు ప్రత్యేకాధికారిగా గ్రామ పంచాయతీలకు ఎంత వరకు న్యాయం చేస్తారన్నది తేలాల్సి ఉంది.



రెబ్బెన మండలం ధర్మారం గ్రామ పంచాయతీ

న్యూస్‌రీల్

నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: సివిల్ సప్లై కార్పొరేషన్‌లో పని చేస్తున్న హమాలీ కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో సివిల్ సప్లై డీఎం నరసింహస్వామికి సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ ఈ నెల 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సివిల్ సప్లై కార్పొరేషన్‌కు గత ప్రభుత్వ బకాయిలను బహిర్గతం చేయాలని, మిల్లర్ల నుంచి రావాల్సిన రూ.11వేల కోట్లు వసూలు చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా బస్తా రేటును క్వింటాలుకు రూ.35కు పెంచాలన్నారు. ఎఫ్‌సీఐ మాదిరి కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు దివాకర్, నాయకులు సుధాకర్, శ్రీనివాస్, నారాయణ, రాజు, రాజన్న, దత్తు, జగదిరావ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హుల జాబితా విడుదల

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో పీఎం జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా మొబైల్ మెడికల్ యూనిట్‌లో పోస్టుల నియామకానికి సంబంధించి ఒప్పంద ప్రాతిపదికన అర్హులైన అభ్యర్థుల జాబితాను వైద్యారోగ్యశాఖ విడుదల చేసింది. జిల్లా కేంద్రంలోని వైద్యారోగ్య శాఖ కార్యాలయంలోని నోటీసు బోర్డుతోపాటు https://asifabad.telangana.gov.in వెబ్‌సైట్‌లో జాబితా అందుబాటులో ఉందని డీఎంహెచ్‌వో తుకారాం ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్ జాబితాలోని అభ్యర్థులు ఈ నెల 7న ఉదయం 10 గంటలకు అన్ని ధ్రువపత్రాలతో కలెక్టరేట్‌లో నిర్వహించే కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని సూచించారు.

రాష్ట్రస్థాయిలో సత్తా చాటాలి



ప్రశంసాపత్రాలు ఇస్తున్న డీఈవో అశోక్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా ప్రతిష్టను నిలబెట్టే విధంగా విద్యార్థులు రాష్ట్రస్థాయిలో సత్తా చాటాలని డీఈవో అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోమవారం జిల్లాస్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. డీఈవో మాట్లాడుతూ ఈ నెల 9 నుంచి 11 వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపాలన్నారు. తెలుగు మీడియంలో జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ పాఠశాల విద్యార్థులు నిఖిల్, శంకర్, తిరుపతి, ఇంగ్లిష్ మీడియంలో తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు రాకేశ్, వర్షిత్, జశ్వంత్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్, జిల్లా సైన్స్ అధికారి మధుకర్, ఎస్‌వోలు భరత్, అబిద్ అలీ, ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

'గావ్ చలో అభియాన్' విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న కొత్తపల్లి శ్రీనివాస్

కాగజ్‌నగర్‌రూరల్: గావ్ చలో అభియాన్(పల్లెకు పోదాం) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాన మంత్రి మోదీ హయాంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను కార్యకర్తలు గ్రామాలకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం, జిల్లా ఉపాధ్యక్షులు గణపతి, విశ్వేశ్వర్‌రావు, జిల్లా అధికార ప్రతినిధి సమీర్ గుప్తా, జిల్లా కోశాధికారి అరుణ్‌లోయా, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేస్తేనే అభివృద్ధి



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

- కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు సమన్వయంతో పని చేస్తేనే గ్రామ పంచాయతీల అభివృద్ధి సాధ్యమని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి సోమవారం ప్రత్యేకాధికారులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సర్పంచుల పదవీకాలం ముగియడంతో జిల్లాలోని 335 పంచాయతీలకు 125 మంది ప్రత్యేకాధికారులను నియమించామని అన్నారు. ఈ నెల 2న బాధ్యతలు స్వీకరించిన ప్రత్యేకాధికారులు ఈ నెల 7 నుంచి 15 వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. నూతన పంచాయతీరాజ్ చట్టాలపై ప్రత్యేకాధికారులకు అవగాహన ఉండాలని సూచించారు. ప్రతీ ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని, హరితహారం కింద నాటిన మొక్కలను రక్షించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నర్సరీల నిర్వహణపై దృష్టి సారించాలని, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డుల నిర్వహణ, విద్యుత్ దీపాల ఏర్పాటును పర్యవేక్షించాలని సూచించారు. గ్రామ సభలకు ప్రత్యేకాధికారులు అధ్యక్షత వహించి, ఆదాయ వ్యయాలపై సమీక్షించాలన్నారు. గ్రామాభివృద్ధి ప్రణాళికలు రూపొందించి పోర్టల్‌లో నమోదు చేయాలని, 100 శాతం ఇంటి పన్నులు వసూలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీల్లో అక్రమ వెంచర్లపై దృష్టి సారించాలన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఏర్పాటు చేసిన సహాయక పోలింగ్ కేంద్రాల్లో షాడో పోలింగ్ కేంద్రాలు, నెట్‌వర్క్ అందుబాటులో లేని కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ఆ ప్రాంతాల్లో నెట్‌వర్క్ సిగ్నల్ వివరాలు సేకరించి, సెక్టోరల్ అధికారులకు అందించాలన్నారు. డీపీవో ఉమర్ హుస్సేన్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, డివిజనల్ పంచాయతీ అధికారి సురేశ్ ఉన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన 'పాల్వాయి'



మంత్రికి నివేదిక అందిస్తున్న హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌రూరల్/కౌటాల: కౌటాల మండలం గుండాయిపేట్ సమీపంలో వార్ధా ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించాలని కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు విన్నవించారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని సోమవారం ఆయన నివాసంలో కలిసి వార్ధా ప్రాజెక్టు నివేదిక అందించారు. ప్రాజెక్టు ప్రాముఖ్యతను మంత్రికి వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సిర్పూర్ నియోజకవర్గం చుట్టూ నదులున్నా రైతులు సాగునీటికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. వార్ధా ప్రాజెక్టుతో ఉమ్మడి జిల్లాలో రెండున్నర లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందించవచ్చని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తగిన ప్రతిపాదనలు పంపిస్తే ప్రధాన మంత్రి కిసాన్ సించాయి యోజన కింద సాయం అందిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని హరీశ్‌బాబు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌అర్బన్: బ్యూటీషన్‌పై శిక్షణ ఇచ్చేందుకు బ్యూటీషన్ కోర్సులో శిక్షణ పొందిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి సావిత్రి తెలిపారు. మహిళా శిశు సంక్షేమశాఖ పరిధిలో కొనసాగుతున్న జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు 45 రోజులపాటు శిక్షణ కొనసాగుతుందన్నారు. అభ్యర్థులు ఈ నెల 6 నుంచి 8 వరకు సాయంత్రం 5 గంటల్లోగా విద్యార్హత, శిక్షణ ధ్రువపత్రాలతో జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. వయస్సు 35లోపు ఉండాలని, స్థానికులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. 45 రోజుల శిక్షణ పూర్తయిన తర్వాత ట్రైనర్‌కు రూ.30వేల వేతనం అందిస్తామని, వివరాలకు 89194 15934లో సంప్రదించాలని కోరారు.

స్టాఫ్‌నర్సుల పడిగాపులు



మెడికల్ కాలేజీలో స్టాఫ్‌నర్సులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో 159 మంది స్టాఫ్‌నర్సులుగా ఎంపికైన విషయం తెలిసిందే. సోమవారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ వైద్యకళాశాలలో అధికారులకు జాయినింగ్ రిపోర్టు చేశారు. అయితే సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాత్రి 9 గంటల వరకు కాలేజీ ఆవరణలోనే పడిగాపులు కాశారు. చిన్నారులు, పసిపిల్లలను వారి వెంట వచ్చిన సహాయకులు ఆడించారు. ఉదయం నుంచి రాత్రి వరకు స్టాఫ్ నర్సులు అక్కడే గడిపారు. అధికారులు కాలయాపన చేస్తూ సమయం వృథా చేశారని పలువురు ఆరోపించారు.

12న నులిపురుగుల నివారణ దినోత్సవం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్: జిల్లాలో ఈ నెల 12న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పాఠశాలలు, వసతి గృహాలు, కేజీబీవీలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 19లోగా వందశాతం నివారణ మాత్రలు అందించే లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. మాత్ర వేసుకునే ముందు విద్యార్థులు భోజనం చేసేలా విద్యా సంస్థల్లో ఉపాధ్యాయులు, అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో తుకారాం, డీఈవో అశోక్, ఎస్సీ కార్పొరేషన్ అధికారి సజీవన్, జిల్లా సంక్షేమ అధికారి సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు వినియోగించుకోవాలి



శిక్షణ కార్యక్రమంలో అధికారులు, అభ్యర్థులు

ఆసిఫాబాద్‌అర్బన్: యువత ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ప్రొడక్టివిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో వందమంది ఎస్సీ, ఎస్టీ యువతకు ఒకరోజు నైపుణ్య శిక్షణ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని, యువత ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఏపీపీసీ కోఆర్డినేటర్ సత్యం, నిర్వాహకులు యాసిన్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి వినతుల వెల్లువ

- కలెక్టరేట్‌కు తరలివచ్చిన బాధితులు
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ హేమంత్ బోర్కడే
- సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ



అర్జీ పరిశీలిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుంచి బాధితులు తరలివచ్చారు. వినతులు సమర్పించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. అర్జీలు స్వీకరించిన కలెక్టర్ హేమంత్ బోర్కడే.. సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని బాధితులకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా తొలగించిన రేషన్‌కార్డు మళ్లీ అందించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని వాంకిడి మండలం సడక్‌గూడ గ్రామానికి చెందిన షేక్ షకీలబీ అర్జీ అందించింది. తన కుమారులు భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, వారి నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని కౌటాల మండలం సదాశివపేటకు చెందిన సిడాం రామారావు కోరాడు. భర్త అనారోగ్యంతో పిల్లల పోషణ భారంగా మారిందని, డిగ్రీ పూర్తి చేసిన తనకు ఉపాధి అవకాశం కల్పించాలని కాగజ్‌నగర్‌కు చెందిన వనితారాణి విన్నవించింది. 90శాతం మూగ, చెవిటి వైకల్యం ఉందని పింఛన్ అందించాలని చింతలమానెపల్లి మండలం రణవెల్లికి చెందిన ఎం.ఆస్మినా కోరింది. కుడి కన్ను వందశాతం కనిపించదని, గత సదరం శిబిరంలో జీరో శాతంగా నమోదు కావడంతో పింఛన్ నష్టపోతున్నానని సమస్య పరిష్కరించాలని పెంచికల్‌పేట్ మండలం బొంబాయిగూడకు చెందిన చౌదరి వెంకటేశ్ వేడుకున్నాడు. రెబ్బెన మండలం చిలుకమారిగూడ శివారులో తన తండ్రి పేరుపై గల భూమిని ఇతరుల పేరుతో ఆన్‌లైన్‌లో నమోదు చేశారని, దీనిని సవరించాలని ఎర్రవోతుల శంకరయ్య దరఖాస్తు చేసుకున్నాడు. పదేళ్ల క్రితం తన భర్త చనిపోయారని, వితంతు పింఛన్ అందించాలని ఆసిఫాబాద్ మండలం అంకుసాపూర్‌కు చెందిన మెంగ్రె శెవంత అర్జీ అందించింది. పుట్టుకతో రెండు కాళ్లు వంకరగా ఉండటంతో ఆపరేషన్ చేశారని, వైకల్యం కలిగిన తనకు కోవిడ్ తర్వాత నుంచి పింఛన్ రావడం లేదని వెంటనే పునరుద్ధరించాలని కాగజ్‌నగర్‌కు చెందిన సతీశ్‌కుమార్ కోరాడు. దారి కోసం పత్తి పంటను నాశనం చేసిన ఇద్దరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆసిఫాబాద్ మండలం బూర్గుడకు చెందిన గాజుల కొమురయ్య ఫిర్యాదు చేశాడు.

సదరం సర్టిఫికెట్ ఇప్పించాలి



లింబర్, డిస్క్ సమస్యతోపాటు బోదకాలు వ్యాధితో ఇబ్బంది పడుతున్నా. 2016లో సదరం సర్టిఫికెట్ జారీ చేశారు. 2019లో మరోసారి నిమ్స్‌లో సదరం సర్టిఫికెట్ తీసుకున్నా. 2019లో రెన్యూవల్ కోసం వెళ్తే రిజెక్ట్ చేశారు. మళ్లీ నాకు సదరం సర్టిఫికెట్ జారీ చేసి ఆదుకోవాలి.

– గోపిచంద్ కటియార్, కాగజ్‌నగర్

గోవారి తెగను ఎస్టీల్లో చేర్చాలి



రాష్ట్రంలో గోండు ఆదివాసీలతోపాటు గోండ్ గోవారి(గోవారి) తెగను ఎస్టీ జాబితాలో చేర్చాలి. గతంలో మాకు బీసీ సర్టిఫికెట్ ఇవ్వగా, ప్రస్తుతం ఎలాంటి కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వడం లేదు. ఎస్టీల్లో చేర్చి ధ్రువీకరణ పత్రాలు అందించాలి.

– ఎస్.గోపిచంద్, గోవారి సంఘం జిల్లా అధ్యక్షుడు

పింఛన్ బందయింది



బస్సు ప్రమాదంలో నా ఎడమకాలుకు గాయాలై నడవలేని పరిస్థితికి వచ్చింది. ఈ క్రమంలో సదరం సర్టిఫికెట్ తీసుకోవడంతో 6 నెలలపాటు పింఛన్ కూడా వచ్చింది. ఈ నెల నుంచి బందయింది. సమస్య పరిష్కరించాలి.

– బెండారి నాందేవ్, ముత్తన్‌పేట

రైతుబంధు కొనసాగించాలి



తండ్రి నుంచి నాకు కరంజివాడలో 8.8 ఎకరాల భూమి వారసత్వంగా వచ్చింది. 30 ఏళ్లుగా భూమి సాగు చేస్తున్నాం. అటవీహక్కు పత్రం కూడా ఇచ్చారు. ఇటీవల ఆన్‌లైన్‌లో స్టాప్ పర్మిట్ అని వచ్చింది. రైతుబంధు కొనసాగించాలి.

– రాథోడ్ శ్రీనివాస్, కరంజివాడ, కెరమెరి

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు



జిల్లా కేంద్రంలోని రాజంపేట కాలనీలో వీధిదీపాలు, డ్రైనేజీలు, సీసీరోడ్లు లేవు. కాలనీలో ఐరన్ విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. ట్రాన్స్‌కో ఏఈకి తెలిపినా పట్టించుకోవడం లేదు. గతంలో ఇద్దరు విద్యుత్ షాక్‌తో మృతి చెందారు.

– రాజంపేట మహిళలు

క్లుప్తంగా

7న కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక

శ్రీరాంపూర్: సీసీసీలోని కుమార్ స్పోర్ట్స్ డిఫెన్స్ అకాడమీలో ఈ నెల 7న సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రాంచందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16 సంవత్సరాలలోపు బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొనే అవకాశం ఉందన్నారు. ఎంపికైన జట్లు ఈ నెల 16 నుంచి 19 వరకు సూర్యాపేట జిల్లాలోని మల్లారెడ్డిగూడెంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 7702115889 నంబరులో సంప్రదించాలని సూచించారు.

యోగా పోటీల్లో ప్రతిభ



మెమొంటో అందుకుంటున్న భగవాన్‌దాస్

లక్సెట్టిపేట: ఇండియన్ యోగా పాఠశాల ఆధ్వర్యంలో ఈ నెల 4న బెల్లంపల్లిలో నిర్వహించిన జాతీయస్థాయి యోగాసన్ చాంపియన్ షిప్ పోటీలలో పట్టణానికి చెందిన రాపల్లి భగవాన్ దాస్ పాల్గొని ప్రథమస్థానంలో నిలిచారు. నిర్వాహకులు రాజలింగు చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్నారు. ఈసందర్భంగా పట్టణానికి చెందిన పలువురు ఆయనను అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్ఎం

దండేపల్లి: సాంఘికశాస్త్రం ఫోరం ఆధ్వర్యంలో ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన సాంఘిశాస్త్ర ప్రతిభా పాటవ పోటీ ల్లో మండలంలోని వెల్గనూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి అభినయ్ ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. ఇదే పాఠశాల నుంచి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడం ఇది ఐదోసారి. రాష్ట్ర స్థాయికి ఎంపికైన అభినయ్‌ను హెచ్ఎం విజయలక్ష్మి, గైడ్ టీచర్ నరసింహులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పట్టుబడిన ట్రాక్టర్‌తో మైనింగ్ సిబ్బంది

భీమారం: జైపూర్ మండలంలోని రసూల్‌పల్లి వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం తెల్లవారు జామున పట్టుకున్నట్లు మంచిర్యాల మైనింగ్ ఏడీఏ బాబు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా రసూల్‌పల్లి వాగు నుంచి ఇసుక తరలిస్తున్నారనే సమాచారం రావడంతో మైనింగ్ సిబ్బంది వెళ్లి ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను జైపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నామానగర్ గ్రామానికి చెందిన దడ్డి సత్యంపై దాడి చేసిన అదే గ్రామానికి చెందిన ఇట్యాల ఆశాలుపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఈజ్‌గాం ఎస్సై రామన్ కుమార్ తెలిపారు. పాతకక్షలను దృష్టిలో పెట్టుకుని ఆశాలు, సత్యంపై దాడి చేశారని పేర్కొన్నారు. సత్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఆయన పేర్కొన్నారు.



ఇంద్రాదేవికి మొక్కుతున్న మెస్రం వంశీయులు



మర్రిచెట్టు వద్ద గంగాజలం భద్రపరుస్తున్న మెస్రం పెద్దలు



నైవేద్యాలు తయారు చేస్తున్న మెస్రం ఆడపడుచులు



కేస్లాపూర్ మర్రిచెట్టు వద్ద మెస్రం వంశీయులు

ఇంద్రాదేవికి 'మెస్రం' పూజలు..

- అనంతరం కేస్లాపూర్‌కు పయనం
- మర్రిచెట్టు వద్ద బస

ఇంద్రవెల్లి: నాగోబా జాతరలో భాగంగా మహాపూజకు అవసరమయ్యే గంగాజలం సేకరించిన మెస్రం వంశీయులు పాదయాత్రగా సోమవారం ఇంద్రవెల్లికి చేరుకున్నారు. ఇంద్రాదేవి ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. పవిత్ర గంగాజలాన్ని ఆలయం ఎదుట ఉన్న మర్రి చెట్టుపై భద్రపరిచారు. వీరి రాక నేపథ్యంలో ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి 22 కితల మెస్రం వంశీయులు ఎడ్ల బండ్లతో ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. సంప్రదాయం ప్రకారం నైవేద్యాలు తయారు చేసి అమ్మవారికి సమర్పించారు. రాత్రి కేస్లాపూర్ సమీపంలోని మర్రి చెట్టు వద్దకు చేరి అక్కడే బస చేశారు. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు సంప్రదాయ పూజలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ప్రధాన్ కితకు చెందిన దాదారావ్ ఆధ్వర్యంలో నాగోబా చరిత్ర బోధిస్తారు. ఈ నెల 9న రాత్రి 10:30 గంటలకు మహాపూజ అనంతరం జాతర ప్రారంభించనున్నట్లు నాగోబా ఆలయ పీఠాధిపతి వెంకట్‌రావ్ తెలిపారు. కార్యక్రమంలో మెస్రం వంశపెద్దలు కోసు కటోడా, కోసేరావ్, దాదారావ్, హనుమంత్ రావ్, తిరుపతి తదితరులున్నారు.

ఆశలు రేకెత్తిస్తున్న 'మామిడి'

- విరగబూసిన మామిడి చెట్లు
- రైతుల్లో వెల్లివిరుస్తున్న ఆనందం
- ప్రకృతి కరుణిస్తే లాభాల పంట
- సస్యరక్షణ చర్యలు తీసుకోవాలంటున్న ఉద్యాన అధికారులు

బెల్లంపల్లి/చెన్నూర్‌రూరల్/నెన్నెల: ఈ ఏడాది విరగబూసిన మామిడి తోటలు రైతుల్లో ఆనందాన్ని కలిగిస్తున్నాయి. మొన్నటి వరకు బోసిగా కనిపించిన చెట్లు ఈ వారంలో మామిడి పూతతో కళకళలాడుతున్నాయి. కొమ్మ కొమ్మకు పూత ఏపుగా రావడంతో చెట్లన్నీ పసిడి వర్ణాన్ని పులుముకున్నాయి. ప్రస్తుతం వచ్చిన పూత, కాత చివరి వరకు నిలిచి ఎలాంటి తెగుళ్లు సోకకుండా ఉంటే ఆశించిన దిగుబడులు సాధించే అవకాశం ఉంది. గతేడాదితో పోల్చితే ఈసారి జిల్లా రైతుల్లో మామిడి తోటలు ఆశలు రేకెత్తిస్తున్నాయి.

జిల్లా వ్యాప్తంగా 16వేల ఎకరాల్లో సాగు

జిల్లాలో 16 మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో 16 వేల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నట్లు ఉద్యానశాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. జిల్లాలోని కాసిపేట, మంచిర్యాల, చెన్నూర్, కోటపల్లి, మందమర్రి, జైపూర్, తాండూర్, హాజీపూర్, భీమారం, నెన్నెల, వేమనపల్లి, బెల్లంపల్లి, కన్నెపల్లి, దండేపల్లి మండలాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. నాలుగేళ్లుగా ప్రకృతి అనేక ఆటుపోట్లను కల్పించింది. మామిడి చెట్లకు పూత సరిగా రాక, వచ్చిన పూత పిందెదశకు చేరక, చీడపీడలు, తెగుళ్లు ఆశించాయి. ఈ కారణంగా పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. ఈసారైనా వచ్చిన పూత వచ్చినట్టే నిలిచి మొగ్గ తొడిగి కాపునకు వచ్చే వరకు ప్రకృతి కరుణించాలని రైతులు ఆశిస్తున్నారు.

సస్యరక్షణ చర్యలు తప్పనిసరి

సాధారణంగా చెట్టు నిండా పూత వచ్చినా అదంతా పిందెదశకు చేరే అవకాశాలు ఉండవు. వచ్చిన పూత సగానికి పైగా రాలి పోయే అవకాశాలు ఉంటాయని ఉద్యానవనశాఖ అధికారులు పేర్కొంటున్నారు. మామిడిచెట్లకు పూత వచ్చేందుకు గతేడాది డిసెంబర్‌లో రైతులు మందులు పిచికారీ చేశారు. అయితే పూత ఏపుగా వచ్చి ఆశాజనకంగా ఉన్నా సంరక్షించుకోవడానికి రైతులు తగిన యాజమాన్య పద్ధతులు పాటించాల్సి ఉంటుంది. చెట్లకు బూడిద, బూజు తెగుళ్లు ఆశించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. చీడపీడలు, తెగుళ్ల ప్రభావం ఏమాత్రం కనిపించినా వెంటనే స్పందించాలి. అనివార్యమైన పరిస్థితుల్లో సిఫారసు చేసిన మందులను మాత్రమే పూతపై స్ప్రే చేయాలని ఉద్యానవన అధికారులు పేర్కొంటున్నారు. ఇష్టానుసారంగా తమకు తోచిన పద్ధతుల్లో మందులు పిచికారీ చేయవద్దని సూచిస్తున్నారు. పూత మొగ్గ తొడిగి, పిందెదశకు చేరే వరకు తగిన జాగ్రత్తలు పాటించాలి. ఆ దిశగా పంట సంరక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సూచనలు కరువు

మెట్ట ప్రాంత రైతులకు పండ్ల తోటల పెంపకంపై ప్రోత్సాహంతో పాటు సూచనలు కరువయ్యాయి. తోటలకు ఏ పరిస్థితిలో ఎలాంటి మందులు వాడాలనే సూచనలు ఇచ్చే హార్టికల్చర్ అధికారుల జాడ కనిపించడం లేదు. కనీసం పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, బీమా సౌకర్యం గూర్చి సమాచారం తెలియడం లేదని మండల సమావేశాల్లో పలువురు ప్రజాప్రతినిధులు ఆరోపణలు చేసిన ఫలితం కనిపించలేదు. అధికారులు అందుబాటులో లేకపోవడంతో రైతులు తమకు తోచిన మందులను పిచికారీ చేసి నష్టపోతున్నారు. పూతదశలో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి చీడపీడలు, తెగుళ్లను గుర్తించి సరైన మందులు సూచించాల్సి ఉంది.



నిండుగా వచ్చిన పూతతో మామిడి చెట్లు

లీజుకు సన్నాహాలు

మామిడి చెట్లకు పూత రావడమే తరువాయి గుత్తేదారులు, గుమాస్తాలు, దళారులు తోటల బాట పడుతున్నారు. చెట్లకు వచ్చిన పూతను అంచనా వేసి మామిడి కాపును లీజుకు తీసుకోవడానికి బేరసారాలు చేస్తున్నారు. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న దశేరి, బంగెనపల్లి వంటి రకాలకు జిల్లాలోని మామిడి చెట్లు ఎంతో ప్రసిద్ధి గాంచాయి. మామిడి ఉత్పత్తులను అమ్ముకోవడానికి రైతులు ఏటా నానాతిప్పలు పడుతున్నారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ మార్కెట్‌కు తీసుకెళ్లి దళారుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి పంటను విక్రయిస్తున్నారు. రైతుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకున్న బడా వ్యాపారులు సిండికేట్‌గా మారి కనీస మద్దతు ధరకూడా గిట్టుబాటు కాకుండా చేస్తుండటంతో నష్టాలపాలవుతున్నారు. బెల్లంపల్లి కేంద్రంగా రూ.1.26 కోట్ల అంచనాతో మ్యాంగో మార్కెట్ నిర్మాణం చేసినా క్రయవిక్రయాలు జరగడంలేదు. ట్రేడర్స్ లైసెన్స్‌లు తీసుకోకుండా నిరాకరిస్తున్నారు. వీరికి సరైన అవగాహన కల్పించి స్థానికంగానే మామిడి ఉత్పత్తుల అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకోవడంలో పాలకులు, అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు.

పూత బాగానే వచ్చింది



మామిడి చెట్లకు ఈ ఏడు పూత బాగానే వచ్చింది. కాత కూడా బాగా ఉండాలి. గతేడాది ఎక్కువగా కాయలోపల పురుగు ఆశించి నష్టపోయాం. ఈ ఏడు ఎలా ఉంటుందో చూడాలి.

– తిరుపతి, మామిడి రైతు, బుద్దారం

సూచనలు ఇచ్చే వారు లేరు



మామిడి తోటల పెంపకంపై మాకు సూచనలు ఇచ్చే వారు కరువయ్యారు. మాకు తెలిసిన మందులు పిచికారీ చేసుకుంటున్నాం. వాతావరణంలో మార్పులతో మామిడి పూత, పిందెలు రాలిపోతున్నాయి.

– అరుణ్‌సింగ్, మామిడి రైతు, నెన్నెల

జాగ్రత్తలు తీసుకోవాలి



గతేడాదితో సరిచూస్తే ఈసారి మామిడి చెట్లకు పూత నిండుగా వచ్చింది. వచ్చిన పూత పూర్తిగా నిలవదు. కొంత రాలిపోతుంది. ఇష్టారీతిగా మందులు స్ప్రే చేయవద్దు. ఉద్యానవన అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలి. యాజమాన్య పద్ధతులు పాటించాలి.

– ఉదయ్‌కుమార్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, మంచిర్యాల

సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న పవర్ ప్లాంట్ కార్మికులు

పాతమంచిర్యాల: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శాలివాహన పవర్ ప్లాంట్ కార్మికులు సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పవర్ ప్లాంట్ కార్మికసంఘం అధ్యక్షుడు కుంటాల శంకర్ మాట్లాడుతూ ప్లాంట్ మూసివేసి 14 నెలలైనప్పటికీ యాజమాన్యం కార్మికులకు రావాల్సిన వేతనాలు, ఇతర బెనిఫిట్‌లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ఆరు రోజులుగా ప్లాంట్ గేట్ ఎదుట నిరాహారదీక్ష చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ జిల్లా కార్యదర్శి మద్దూరి రాజు యాదవ్, పవర్ ప్లాంట్ కార్మికులు పాల్గొన్నారు.

అధ్యక్షురాలిగా అరుణాబాయి



ఆసిఫాబాద్: తెలంగాణ రాష్ట్ర రవాణా ఉద్యోగుల సంఘం కాళేశ్వరం జోన్ అధ్యక్షురాలిగా జాదవ్ అరుణాబాయి ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధికారి కృష్ణయ్య ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవాణాశాఖ కార్యాలయంలో ఆదివారం ఎన్నికలు నిర్వహించారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న అరుణాబాయిని అధ్యక్షురాలిగా ఎన్నుకున్నారు. జిల్లా రవాణా శాఖ అధికారి గంధం లక్ష్మి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

గ్రీన్‌వుడ్ పాఠశాలపై చీటింగ్ కేసుకు ఆదేశాలు

రామకృష్ణాపూర్: సీబీఎస్ఈ అనుమతి లేకున్నా ఉందంటూ తల్లిదండ్రులను మోసం చేసిన మంచిర్యాల జిల్లాలోని గద్దెరాగిడి గ్రీన్‌వుడ్ పాఠశాలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డీఈవో యాదయ్య సోమవారం ఎంఈవో పోచయ్యకు ఆదేశాలు జారీ చేశారు. సీబీఎస్ఈ గుర్తింపు లేకపోయినప్పటికీ సీబీఎస్ఈ పేరిట అడ్మిషన్లు తీసుకుని పెద్ద మొత్తంలో ఫీజులు వసూలు చేశారన్న తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి కేసు నమోదుకు ఆదేశించినట్లు డీఈఓ 'సాక్షి'కి తెలిపారు.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

ఆసిఫాబాద్: హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ జిల్లా సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ సోమవారం తీర్పు చెప్పారు. కాగజ్‌నగర్ టౌన్ సీఐ శంకరయ్య తెలిపిన వివరాల ప్రకారం 2020 సంవత్సరంలో కాగజ్‌నగర్ పట్టణంలోని సర్దార్ బస్తీకి చెందిన జాడి జశ్వంత్‌ను అదే బస్తీకి చెందిన బావండపల్లి ప్రవీణ్‌కుమార్ హత్య చేయడంతో కేసు నమోదైంది. అప్పటి ఐఓడీ సీఐ మోహన్ విచారణ జరిపారు. ఈ కేసులో పీపీ జగన్మోహన్ రావు కోర్టులో సాక్షులను ప్రవేశ పెట్టగా నేరం రుజువైంది. హత్యకు పాల్పడిన ప్రవీణ్‌కుమార్‌కు ఐపీసీ సెక్షన్ 302 ప్రకారం జీవితఖైదుతో పాటు రూ. 20 వేలు జరి మానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

ఏరియాలో సేఫ్టీ జీఎం పర్యటన



కేజీ తివారీని సన్మానిస్తున్న అధికారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో సోమవారం కొత్తగూడెం రీజియన్ సేఫ్టీ జీఎం కేజీ తివారీ పర్యటించారు. ఖైరిగూడ ఓసీపీని సందర్శించి ఓసీపీలో చేపట్టిన రక్షణ పద్ధతులను పరిశీలించారు. బొగ్గు ఉత్పత్తి ప్రక్రియలో ఉద్యోగుల భద్రత, రక్షణకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. చిన్న చిన్న నిర్లక్ష్యాలే పెద్ద పెద్ద ప్రమాదాలకు కారణమవుతాయన్నారు. ప్రతి ఒక్కరూ రక్షణ సూత్రాలను తూచా తప్పకుండా పాటిస్తూ రక్షణ పరికరాలను ఉపయోగించాలన్నారు. సేఫ్టీ జీఎం హోదాలో మొదటి సారి ఏరియా పర్యటనకు వచ్చిన సందర్భంగా కేజీ తివారీని గోలేటి లోని జీఎం కార్యాలయంలో ఎస్వోటూ జీఎం మచ్చగిరి నరేందర్, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహరా, డీజీఎం ఫైనాన్స్ రామారావు, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి సన్మానించారు.

మృతదేహం లభ్యం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మంచిర్యాలక్రైం: మంచిర్యాల–పెద్దంపేట రైల్వేస్టేషన్ల మధ్య సోమవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించిందని జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సంపత్ కుమార్ తెలిపారు. మృతునికి సుమారు 35 సంవత్సరాలు ఉంటాయని, నలుపు రంగు చొక్కా, లేత పచ్చరంగు జీన్స్‌ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. అతనికి సంబంధించిన ఎలాంటి ఆధారా లు లభించలేదని, మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి లో భద్రపర్చినట్లు తెలిపారు. వివరాలు తెలిసిన వారు 8712658596, 8328512176 నంబర్లలో సంప్రదించాలన్నారు.

బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత పెంచాలి



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

శ్రీరాంపూర్: సింగరేణి సంస్థను మరింత బలోపేతం చేయడానికి బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత పెంచాలని శ్రీరాంపూర్ ఏరియా ఎస్వోటూ జీఎం కే.రఘుకుమార్ కోరారు. సోమవారం ఎస్సార్పీ 3, 3ఏ గనిపై మల్టీ డిపార్టుమెంటల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ ఆర్థిక స్థితిగతులు తెలుసుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఉద్యోగిపై ఉందన్నారు. భూగర్భ గనుల్లో ఉత్పత్తి ఖర్చును తగ్గించుకోవడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఖర్చు తగ్గించుకుంటేనే సంస్థ మరింత లాభాలు గడిస్తుందన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలన్నారు. యంత్రాల వినియోగం, పనిగంటలు మరింత పెరగాలన్నారు. నాణ్యమైన బొగ్గును రవాణా చేసినప్పుడే సంస్థ నిలబడగలుగుతుందన్నారు. ఇందుకు అన్ని డిపార్టుమెంట్లు సమన్వయంతో పని చేయాలన్నారు. సమావేశంలో గుర్తింపు సంఘం ఏరియా బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏజీఎం మురళీధర్, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవి, ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు, గ్రూప్ ఏజెంట్ గోపాల్‌సింగ్, గని మేనేజర్ సంతోశ్‌కుమార్, ఏఐటీయూసీ నాయకులు వీరభద్రయ్య, కొమురయ్య, మురళి చౌదరి, అధికారులు శ్రీధర్, మహేందర్, ప్రేమ్‌కుమార్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

బైక్‌తో సహా ఒకరు సజీవదహనం

- యాదాద్రి భువనగిరి జిల్లాలో ఘటన
- మృతుడు కాగజ్‌నగర్ వాసి



నాగరాజు (ఫైల్)

భువనగిరి క్రైం: ఓ వ్యక్తి బైక్‌తో సహా సజీవదహనమైన సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లాలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌కు చెందిన సూర నాగరాజు (39) హైదరాబాద్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా మధుమేహంతో పాటు ఇతర వ్యాధులతో బాధపడుతున్నాడు. సోమవారం తెల్లవారుజామున బైక్‌పై భువనగిరి మండలం అనంతారం గ్రామంలోని ఫ్లెటోవర్ బ్రిడ్జి వద్దకు చేరుకున్నట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది. అనంతరం బైక్‌తో పాటు వ్యక్తి తగలబడిపోతుండడాన్ని స్థానికులు గుర్తించి ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బైక్ నంబర్ ఆధారంగా మృతుడు నాగరాజుగా గుర్తించారు. బైక్‌ను తగులబెట్టి ఆపై తానూ ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని ఏసీపీ వెంకట్‌రెడ్డి, సీఐ ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. మృతుడి బంధువు సుభాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్‌నగర్ సమీపంలోని రాళ్లవాగులో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి (50) మృతదేహం లభించిందని సీఐ రవీందర్ తెలిపారు. మృతుడు భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడని, బహిర్భూమికి వెళ్లి ఏదైనా అనారోగ్యం కారణంచేత అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురి గదిలో భద్రపరిచినట్లు తెలిపారు.

డ్రెయినేజీలో పడి వ్యక్తి మృతి

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో హనుమాన్ విగ్రహం వెనుక గల డ్రెయినేజీలో పడి ఒకరు మృతి చెందినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఆర్పీరోడ్‌లో నివాసం ఉంటున్న బోగె లింగయ్య (40) కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. సోమవారం సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి ఫిట్స్ రావడంతో డ్రెయినేజీలో పడి మృతి చెందాడు. పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి అతని వద్ద పర్సులో ఉన్న సెల్ ఫోన్ నంబర్ల ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుని తల్లి దుర్గమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.



ఆలయం బయట ఉన్న ప్రతిమలకు టెంకాయలు కొడుతున్న మహిళలు



సంప్రదాయ నృత్యం చేస్తున్న మహిళలు



మైసమ్మకు మొక్కుతున్న భక్తులు

'పోతురాజు'కు పోటెత్తిన భక్తజనం

- తరలివచ్చిన ఉమ్మడి జిల్లా ఆదివాసీలు
- భక్తులతో కిక్కిరిసిన ఆలయం

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని సావర్‌కెడా, ఇందాపూర్ సమీపంలో ఉన్న పోతురాజు ఆలయానికి సోమవారం భక్తజనం పోటెత్తింది. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఆదివాసీలతో పాటు, ఉట్నూర్, వాంకిడి, తిర్యాణి, ఇంద్రవెల్లి, ఆసిఫాబాద్, జైనూర్, నార్నూర్, మహా రాష్ట్రలోని జివితి, ఆదిలాబాద్ తదితర మండలాలకు చెందిన భక్తులు తరలివచ్చి పోతురాజు, ధర్మారాజుకు మొక్కులు చెల్లించుకున్నారు. ఐటీడీఏ ఏపీవో భాస్కర్ హాజరై పూజలు చేశారు. మేకలు, కోళ్లను బలి ఇచ్చారు. జెండాను ఎగురవేశారు. పితృదేవతలకు పూజలు చేశారు. మైసమ్మకు నూనెతో అభిషేకం చేశారు. కొలాం సంప్రదాయబద్ధంగా ఆదివాసీ మహిళలు, యువతులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. భీమదేవరా, తదితర ప్రతిమలు, నాలుగు గోత్రాలకు చెందిన నాలుగు జెండాలకు మహిళలు, వృక్షం నీడన ఉన్న మైసమ్మ దేవతకు పురుషులు మొక్కా రు. నిర్వాహకులు సిడాం రాజు, సిడాం ధర్ము, సిడాం చిన్నభీము, సిడాం కట్టి, ఎంపీపీ పెందోర్ మోతీరాం, జెడ్పీటీసీ దుర్పతబాయి, సీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.